క్లుప్తంగా

వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి

కొత్తగూడెంఅర్బన్: వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పట్టణంలోని రోడ్లన్నీ ఇబ్బందికరంగా మారాయి. ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్సై నరేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెం పట్టణంలోని సింగరేణి హెడ్ ఆఫీస్ ఏరియా, రామవరం బ్రిడ్జి, పోస్టాఫీస్ సెంటర్, బస్టాండ్ సెంటర్, రైల్వే అండర్ బ్రిడ్జి, రైల్వే స్టేషన్, సూపర్‌బజార్, గణేష్ టెంపుల్, ముర్రేడు వాగు బ్రిడ్జి ప్రాంతాల వైపు ప్రయాణం చేసేటప్పుడు మలుపుల వద్ద జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. టైర్లు జారి కిందపడే అవకాశం ఉందని, రోడ్లపై ఏర్పడిన గుంతలు నీటితో నిండి కనబడకుండా ఉన్నట్లు తెలిపారు. కావున వాహనదారులు తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు.

ఇళ్ల పట్టాలు పంపిణీ చేయండి


మాట్లాడుతున్న కామేష్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణంలో జీఓ 76 ద్వారా దరఖాస్తు చేసుకున్న వారి పట్టాల పంపిణీ ప్రక్రియ ప్రారంభించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. పట్టణంలో ఎన్నో ఏళ్లుగా నివాసముంటున్న వారి కోసం తీసుకొచ్చిన జీఓ 76 ద్వారా దరఖాస్తు చేసుకొని రోజులు గడుస్తున్నా పట్టాల పంపిణీ ప్రారంభించలేదని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యేకు రాజకీయం తప్ప ప్రజా సంక్షేమాన్ని పట్టడం లేదన్నారు. గంధం మల్లికార్జున్‌రావు, సాయి, జిల్లా కార్యదర్శి చెనిగారపు నిరంజన్ కుమార్, జమ్ముల కుమారి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వినోద్‌కుమార్‌ను కలిసిన 'మద్దెల'

కొత్తగూడెంరూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ జన్మదినం సందర్భంగా బుధవారం ఆయనను హైదరాబాద్‌లో ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. అందెల ఆనందరావు, రాజలింగం, భోగరాజు, బండా సాయి, దీవేన్, సంతోష్ తదితరులు ఉన్నారు.

వివాహిత అదృశ్యం

ఇల్లెందు: మండలంలోని దండగుండాలకు చెందిన ఓ వివాహిత అదృశ్యమైంది. గ్రామానికి చెందిన పి.రామకృష్ణ తన భార్యను ఈనెల 22న ఖమ్మంలో ఉంటున్న తల్లివద్దకు వెళ్లేందుకు బస్ ఎక్కించాడు. అయితే, ఆమె ఖమ్మం వెళ్లలేదని తెలియడంతో ఎక్కడ వెతికినా ఆచూకీ లేక బుధవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

అర్హులకు మొండి చేయి

బీసీ బంధు పథకానికి లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని దరఖాస్తుదారులు లబోదిబోమంటున్నారు. చేతివృత్తులు చేయని వారికి, ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్న వారికి, ఆర్థికంగా ఉన్నవారికి, గతంలో బీసీ రుణాలు పొందిన వారిని లబ్ధిదారులుగా గుర్తించడం ఏమిటనీ అర్హులు ప్రశ్నిస్తున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు చేతివాటం చూపించి, అర్హులకు అన్యాయం చేశారని జూలూరుపాడు మండలంలో విమర్శలు వినపడుతున్నాయి.

- బీసీ రుణాల కోసం ఎదురుచూపు
- లబ్ధిదారుల జాబితాలో ఒకే కుటుంబం నుంచి ఇద్దరు, ముగ్గురు
- అధికార పార్టీ నాయకుల చేతివాటం


జూలూరుపాడులో వడ్రంగి పని చేస్తున్న కార్మికుడు

జూలూరుపాడు: రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తులు, చేతి వృత్తుల వారికి చేయూత నందించాలనే లక్ష్యంతో బీసీ బంధు పథకాన్ని ప్రవేశపెట్టింది. కానీ లబ్ధిదారుల జాబితాలో కులవృత్తులు, చేతి వృత్తుల్లో లేనివారి పేర్లు ఉన్నాయి. దళితబంధులో ఎలా అక్రమాలు చోటు చేసుకున్నాయో.. ఇప్పుడు బీసీ బంధులో కూడా అదే జరుగుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. బీసీ బంధు పథకానికి జూలూరుపాడు మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో 521 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం మొదటి విడతలో 15 కులవృత్తులు, చేతివృత్తులకు బీసీ బంధును ప్రకటించడంతో ఆయా వృత్తిదారుల దరఖాస్తులను మాత్రమే తీసుకొని మిగిలిన 143 బీసీ అభ్యర్థుల దరఖాస్తులను తిరస్కరించారు. మండలస్థాయిలో సర్వే బాధ్యతను గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అప్పగించారు. బీసీ బంధుకు రజక, నాయీబ్రాహ్మణ, కంసాలి, వడ్రంగి, కంచరి, శిల్పులు, గోల్డ్‌స్మిత్, కమ్మరి, వడ్డెర, కుమ్మరి, మేదర, మేర(టైలర్స్) దరఖాస్తు చేసుకున్నారు. సర్వేలో క్షేత్రస్థాయికి వెళ్లకుండా సెక్రటరీలు పంచాయతీ కార్యాలయాల్లోనే కూర్చొని లబ్ధిదారులను ఎంపిక చేశారని పలువురు విమర్శిస్తున్నారు. కులవృత్తి, చేతివృత్తి చేస్తున్న వారిని కాకుండా అధికార పార్టీ నాయకులు సూచించిన అభ్యర్థులను ఎంపిక చేశారు. క్షేత్రస్థాయిలో సర్వేను పర్యవేక్షించాల్సిన ఎంపీడీఓ పట్టించుకోకపోవడంతో అర్హులకు అన్యాయం జరిగిందని, ఒక కుటుంబం నుంచే ఇద్దరు, ముగ్గురు, నలుగురు పేర్లు ఎంపిక


సెలూన్‌లో కటింగ్ చేస్తున్న దృశ్యం

జాబితాలో ఉన్నట్లు పలువురు దరఖాస్తుదారులు వాపోతున్నారు. బీసీ బంధు మొదటి విడతలో వైరా నియోజకవర్గానికి 300 యూనిట్లు మంజూరయ్యాయి. ఇందులో జూలూరుపాడు మండలానికి 50 కేటాయించారు. 50 మంది లబ్ధిదారులను ఎంపిక చేయాలని బీసీ కార్పొరేషన్ నుంచి అధికారులను ఆదేశించారు. వీరు ఎంపిక చేసిన జాబితాలో రెండు, మూడు కులాలకు చెందినవారే ఎక్కువ మంది లబ్ధిదారులు ఉండటంతో పలు అనుమానాలకు తావిస్తోంది. స్థానిక ఎమ్మెల్యే జాబితాను బీఆర్‌ఎస్ శ్రేణులకు పంపించారు. దీంతో ఎమ్మెల్యే అనుచరులు మంజూరైన యూనిట్లను పంచుకున్నారని అర్హులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, అధికార పార్టీ నాయకుల వల్లే తమకు అన్యాయం జరిగిందని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నిజమైన అర్హులను గుర్తించి బీసీ బంధు అందజేయాలని కోరుతున్నారు.



అర్హత ఉన్నా బీసీ బంధు రాలేదు..

ఈ ఫోటోలో ఉన్నది మహదేవ నాగేశ్వరరావు, అక్ష్మి దంపతులు. వీరు చేతి వృత్తి (వడ్రంగం) పని చేసుకొని జీవనం సాగిస్తున్నారు. పేదరికంలో ఉన్న వీరు బీసీ బంధు కోసం దరఖాస్తు చేసుకున్నా.. సర్వే కోసం ఎవరూ రాలేదని, గతంలో కూడా ప్రభుత్వం నుంచి మాకు ఎలాంటి సాయం రాలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి మాలాంటి పేదోళ్లకు బీసీ బంధు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డ్రా తీసి ఎంపిక చేయాలి



బీసీ బంధు లబ్ధిదారుల ఎంపికను లాటరీ పద్ధతిలో చేయాలి. అధికార పార్టీ నాయకులు చూపించినవారికి బీసీ బంధు ఇవ్వడం వల్ల అర్హులకు అన్యాయం జరిగింది. లబ్ధిదారుల గుర్తింపు కోసం జరిగిన సర్వే కూడా సక్రమంగా జరగలేదు. అర్హులైన బీసీలందరికీ ప్రభుత్వం రూ. ఒక లక్ష రుణం అందజేయాలి.

– యాసా నరేష్, సీపీఎం నాయకుడు

అనర్హులకు ఇవ్వడం అన్యాయం



అసలు కులవృత్తి, చేతి వృత్తి తెలియని వారిని అర్హుల జాబితాలో చోటు కల్పించడం దారుణం. బీసీ బంధు లబ్ధిదారుల ఎంపిక సర్వే లోపభూయిష్టంగా జరిగింది. అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ బీసీ బంధు రుణం ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. విడతల వారీగా కాకుండా ఒకేసారి అర్హులందరికీ బీసీ బంధు ఇవ్వాలి.

– బానోత్ ధర్మా, ప్రజా పంథా నాయకుడు

అర్హులనే ఎంపిక చేశాం



మండల వ్యాప్తంగా కులవృత్తిదారుల సర్వేను గ్రామ పంచాయతీ కార్యదర్శులు సక్రమంగానే చేశారు. బీసీ బంధు కోసం క్షేత్రస్థాయిలో అర్హులను గుర్తించి ఎంపిక చేయడం జరిగింది. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అర్హుల జాబితాను తయారు చేసి పంపించడం జరిగింది. మంజూరు కాగానే పంపిణీ చేస్తాం.

– కె వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ, జూలూరుపాడు

దేశభక్తి పెంపొందించుకోవాలి


మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేష్

పాల్వంచరూరల్: విద్యార్థి దశ నుంచే దేశభక్తిని పెంపొందించుకోవాలని పాల్వంచ డీఎస్పీ వెంకటేష్ సూచించారు. మండలంలోని కిన్నెరసాని గిరిజన గురుకుల కళాశాలలో బుధవారం కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులు దేశానికి సేవ చేయాలనే తపన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ వినయ్‌కుమార్, ఎస్‌ఐ కార్తీక్, ప్రిన్సిపాల్ రవికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్యకర్తలు అధైర్యపడొద్దు


మాట్లాడుతున్న కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచ: బీఆర్‌ఎస్ కార్యకర్తలు అధైర్యపడొద్దని, ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుకు అండగా ఉండాలని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. బుధవారం పాత పాల్వంచలోని వనమా స్వగృహంలో భారీగా హాజరైన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. వనమా ప్రజల మద్దతులో గెలిచారని, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, ప్రజల మద్దతు సంపూర్ణంగా వనమాకే ఉందన్నారు. ఎన్నికల్లో వనమాను నేరుగా ఎదుర్కోలేక ఇలా కోర్టులను ఆశ్రయించి ఆర్డర్లు తెచ్చారని విమర్శించారు. కేసీఆర్ ఆశీస్సులు వనమాకే ఉన్నాయన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కాపు సీతాలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా రాంబాబు, పాల్వంచ జెడ్పీటీసీ బరపటి వాసుదేవరావు, ఆత్మకమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య, బీఆర్‌ఎస్ నాయకులు మంతపురి రాజుగౌడ్, మల్లెల శ్రీరామ్మూర్తి, రజాక్, ఎస్‌వీఆర్‌కే ఆచార్యులు, పరంజ్యోతిరావు, ముత్యాల వీరభద్రం, రాము, కొట్టి వెంకటేశ్వర్లు, చిరంజీవి, శ్రీను, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జోరువానలోనూ జీపీ కార్మికుల సమ్మె


జూలూరుపాడు: నిరసన తెలుపుతున్న గ్రామ పంచాయతీ కార్మికులు

జూలూరుపాడు: మండల కేంద్రం జూలూరుపాడులో బుధవారం గ్రామ పంచాయతీ కార్మికులు జోరు వానను సైతం లెక్కచేయకుండా సమ్మెను కొనసాగించారు. వర్షంలోనే తడుస్తూ జీపీ కార్మికులు ప్రభుత్వానికి తమ నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా జీపీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు భూక్యా వీర్యా మాట్లాడుతూ 21 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్మికులు ఎస్ నరసింహారావు, యు నరేష్, గౌస్, సురేష్, తంబర్ల లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.


ఇల్లెందురూరల్: ఎంపీడీఓ కార్యాలయం వద్ద..

నేడు చలో కలెక్టరేట్...

ఇల్లెందురూరల్: న్యాయమైన డిమాండ్లు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడాన్ని నిరసిస్తూ గురువారం చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేద్దామని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం 21వ రోజుకు చేరుకుంది. ఎంపీడీఓ కార్యాలయం ఎదుట భారీ వర్షంలోనూ ధర్నా చేశారు. జేఏసీ నాయకులు సారంగపాణి, యాకూబ్‌షావలీ, రాంసింగ్ మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి డిమాండ్లు పరిష్కరించాని కోరారు. జటంగి వెంకన్న, సామేలు, మోహన్‌రావు, నర్సింహారావు, గోపి, కిరణ్ పాల్గొన్నారు.

సోలార్ కార్మికుల ధర్నా



జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సోలార్ కార్మికులు

ఇల్లెందు: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు చెల్లిస్తున్న వేతనాలు సోలార్ కార్మికులకు చెల్లించాలని సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు ఎస్‌ఏ నబీ, యాకుబ్‌షావలీ అన్నారు. బుధవారం ఇల్లెందులోని జీఎం కార్యాలయం ఎదుట, సోలార్‌ప్లాంట్ ఎదుట అక్కడి కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సోలార్‌లో ఎలక్ట్రీషియన్, సెక్యూరిటీ గార్డు, గ్రాస్‌కటింగ్, మిడిల్ క్లీనింగ్ చేసే కార్మికులకు నిర్ణయించిన ప్రకారం వేతనాలు అందటం లేదన్నారు. 20 మంది కార్మికులు ఉంటే బోనస్ చెల్లించాలన్నారు. సోలార్ కార్మికుల శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రతినెలా 7వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ ధర్నాలో సంజీవ్, రాజు, బాలు, ప్రేమ్‌సింగ్, ఉపేందర్, శంకర్, హరి, గణేష్, రామకృష్ణ, శ్రీను, అంజి పాల్గొన్నారు.

మరమ్మతులు చేపట్టండి

టేకులపల్లి: చుక్కాలబోడు గ్రామ పంచాయతీలోని తెల్లవాగు చెరువు కుడి, ఎడమ రెండు కాలువలకు మరమ్మతులు చేయించాలని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ భూక్యా చంద్రకళ బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఈ కాలువల వల్ల జేత్యా తండా, చుక్కాలబోడు, కొత్త తండా, హనుమ తండా, కోయగూడెం, దంతెలతండా తదితర గిరిజన గ్రామాల రైతుల పంట పొలాలకు సాగు నీరు అందుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా తహసీల్ నుంచి మార్కెట్ యార్డ్ వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేయాలని కోరారు. ఈ మార్గంలోనే ఐకేపీ కార్యాలయం, ఆరోగ్య ఉప కేంద్రం, ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉన్నాయని తెలిపారు. వర్షం కారణంగా ఈ మార్గంలో వెళ్లాలంటే చాలా ఇబ్బందికరంగా ఉందని ప్రభుత్వం వెంటనే స్పందించి సీసీ రోడ్డు మంజూరు చేయాలని కోరారు.

సీసీ కెమెరాల పునరుద్ధరణకు చర్యలు


మాట్లాడుతున్న సీఐ వినయ్‌కుమార్

పాల్వంచ: పట్టణంలో సీసీ కెమెరాల పలుచోట్ల దెబ్బతిని పనిచేయడం లేదని, వీటిని త్వరలోనే అన్ని ఏరియాల్లో ఏర్పాటు చేసి, పనిచేసేలా చర్యలు తీసుకునేందుకు మున్సిపాలిటీ అధికారులు సహకరించాలని పాల్వంచ సీఐ వినయ్‌కుమార్ కోరారు. బుధవారం స్థానిక సీఐ కార్యాలయంలో మున్సిపాలిటీ ఏఈ, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ అధికారులు, సీసీ కెమెరాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎస్పీ రోడ్డు, బీసీఎం రోడ్డు విస్తరణలో భాగంగా అనేక చోట్ల సీసీ కెమెరాలు మున్సిపాలిటీ తొలగించలేదని, సంబంధిత కాంట్రాక్టర్లు తొలగించారని తెలిపారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. పట్టణంలో 130 సీసీ కెమెరాలు ఉండాలని, వాటిల్లో చాలా వరకు పనిచేయడం లేదన్నారు. వాటితో పాటు మరికొన్నింటిని తిరిగి ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా వర్షాల కారణంగా సమస్యాత్మక ప్రాంతాలు, డ్రెయినేజీ బ్లాక్ అయ్యే ఏరియాలు గుర్తించాలని, మ్యాన్ హోల్స్ మూసివేయాలని, ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నాని ఆదేశించారు. సమావేశంలో టౌన్ ప్లానింగ్ అధికారి సత్యనారాయణ, ఏఈ రాజేశ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌రావు సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టాఫీసులోకి చేరిన వరద

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో కురుస్తున్న వర్షానికి పోస్టాఫీసు కార్యాలయం ఆవరణలోకి నీరు చేరడంతో ఉద్యోగులు, ఆఫీసుకు వచ్చిన ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. మోకాళ్లలోతు నీళ్లలో నడవలేక అవస్థలు పడ్డారు. కొత్తగూడెం మున్సిపాలిటీ అధికారులు స్పందించి చర్యలు చేపట్టి నీరు బయటకు వెళ్లే విధంగా చూడాలని పోస్టాఫీసు అధికారులు, ప్రజలు కోరుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే కొత్తగూడెం హెడ్ పోస్ట్‌లో వరద నిలుస్తోందని వాపోయారు. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో రోడ్డుపై ప్రవహించే వరద పోస్టాఫీసు ఆవరణలోనికి చేరుతుంది. బుధవారం ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా బస్టాండ్ సెంటర్, పోస్టాఫీసు ఏరియా, సింగరేణి ప్రధాన ఆస్పత్రి ఏరియాలలో వర్షపు నీరు చేరడంతో అక్కడి ప్రజలు ఇబ్బంది పడ్డారు.


మోకాళ్లలోతు వరదలో పోస్టాఫీసు

పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా బుధవారం కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. జనజీవనం స్తంభించి పోయింది. ప్రజలు ఇళ్లల్లో నుంచి బయటికి రాలేదు. కొత్తగూడెంలోని ముర్రేడు వాగు పొంగి ప్రవహించింది. పలు లోలెవల్ వంతెనల మీదుగా వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. చెరువులు మత్తిడి పోస్తున్నాయి. ఇల్లెందు మండలంలోని ప్రధాన వాగులైన మస్సివాగు, మున్నేరు, రాళ్లవాగు, జూలూరుపాడు మండలంలోని పెద్దవాగు, ఎద్దుళ్లవాగు, తుమ్మలవాగు, అలుగు వాగు, టేకులపల్లి మండలంలోని ముర్రేడు, ఇనుపమోరి వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వాగుల వద్ద పోలీసులు రక్షణ చర్యలు చేపట్టారు. పోలీసులు, ఎంపీడీఓ, తహసీల్దార్లు వరద ప్రాంతాలను పర్యవేక్షించారు. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పత్తి చేలు, వరినాట్లు నీట మునిగాయి. పంటచేలు చెరువులను తలపిస్తున్నాయి. – సాక్షి నెట్‌వర్క్


ఇల్లెందు: మత్తడి పోస్తున్న మంచినీటి చెరువు


సుజాతనగర్: సింగభూపాలెం చెరువు అలుగు


పాల్వంచ: వెంకటేశ్వర హిల్స్ కాలనీ మధ్యలో రాతి చెరువు


పాల్వంచరూరల్: జగన్నాథపురంలో నీట మునిగిన పత్తి చేను


ఇల్లెందురూరల్: రాఘబోయినగూడెం చెరువు అలుగును పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ విద్యాలత


టేకులపల్లి: ప్రెగళ్లపాడు రహదారిలోని లోలెవెల్ కల్వర్టును పరిశీలిస్తున్న సీఐ, ఎస్‌ఐ


జూలూరుపాడు: తుమ్మలవాగును పరిశీలిస్తున్న కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, జూలూరుపాడు సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ పురుషోత్తం


కొత్తగూడెంరూరల్: చింతపెంటగూడెం వద్ద..


టేకులపల్లి: చింతోనిచెలక తండా సమీపంలోని పుణ్యపు వాగు ఉధృతి


పాల్వంచరూరల్: చెరువును తలపిస్తున్న పొలాలు

కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి

మణిపూర్‌లో మహిళలపై జరిగిన ఘటనకు, గిరిజనులు, గిరిజనేతరుల మధ్య జరుగుతున్న అల్లర్లకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పీడీఎస్‌యూ, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో జోరువానలోనూ బుధవారం నిరసన ప్రదర్శనలు చేసి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. నాయకులు మాట్లాడుతూ.. ఈ సంఘటనలతో ప్రపంచ దేశాలలో భారత పరువు పోయిందని ధ్వజమెత్తారు. ఇంత జరుగుతున్నా ప్రధాని మోదీ నామమాత్రంగా స్పందించారని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించి ఘటనలకు కారణమైన వారిని కఠినంగా శిక్షించి బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. – సాక్షి నెట్‌వర్క్



పాల్వంచరూరల్: ఉల్వనూరులో నిరసన వ్యక్తం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు


ఇల్లెందురూరల్: ప్రదర్శన నిర్వహిస్తున్న న్యూడెమోక్రసీ కార్యకర్తలు



అటెన్షన్ ప్లీజ్

ఇది అడవి కాదు.. ప్రభుత్వాస్పత్రే !

జూలూరుపాడు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) పరిసరాలు అడవిని తలపిస్తున్నాయి. ఆస్పత్రి చుట్టూ చెట్లు, ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. పాములు, తేళ్లు, కీటకాలకు ఆవాసాలుగా మారాయి. ఆస్పత్రికి వచ్చే రోగులు, ప్రజలతోపాటు, ఆస్పత్రి సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఆస్పత్రి గదుల్లో, ఎల్‌టీ భవనంలోకి పాములు ప్రవేశించే అవకాశం ఉంది. అంతేకాకుండా దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. అధికారులు


ఆస్పత్రి పరిసరాలను శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు. – జూలూరుపాడు

ప్రశ్నించాల్సిన అధికారి : డాక్టర్ రాకేష్ కుమార్, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్, జూలూరుపాడు
సెల్ నంబర్: 9985998656